ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
హన్మకొండ, వరంగల్, జనగాం, మహబూబాబాద్, భూపాలపల్లి, ములుగు
మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట
మంగళవారం | 14 మే, 2024 | పేజీలు : 05

## 45 మంది అభ్యర్థుల బరిలో ఉండడం వల్ల ఓటర్లు కన్ఫ్యూజ్



**ప్రజాపక్షం/పాపన్నపేట:** మెదక్ లోక్ సభ స్థానానికి 44 మంది అభ్యర్థులు పోటీ చేయగా ఒక నోటతో 45కు అభ్యర్థుల జాబితా చేరుకుంది. దీనితో మూడు వరుసలుగా వి.వి ప్యాట్లు అమర్చడంతో చదువుకోలేనివారు పూర్తిగా కన్ఫ్యూజ్ అయ్యారు. వారు వేయాలనుకున్న ఓటు అభ్యర్థి పక్కన నీలి బటన్ నొక్కాలి అనుకున్నవారు మరో వరుసలో

తరువాయి 5లో

# ప్రశాంతంగా ముగిసిన ఎన్నికలు

### గ్రామాల్లో ఎక్కువ, అర్బన్‌లో తక్కువ

**ప్రజాపక్షం/హన్మకొండ ప్రతినిధి :** పార్లమెంటు ఎన్నికల పోలింగ్ సోమవారం జిల్లా వ్యాప్తంగా ప్రశాంతంగా జరిగాయి. ఈ సందర్భంగా వరంగల్ లోక్‌సభ ఎన్నికల అధికారి,కలెక్టర్ ప్రావీణ్య,వరంగల్ సిపి అంబర్ కిషోర్ ఝా,జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ పోలింగ్ కేంద్రాలను స్వయంగా సందర్శించారు. జిల్లాలోని పలు గ్రామాల్లో ప్రజలు స్వేచ్ఛగా, నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటుచేశారు. పెట్రోలింగ్ వాహనాలు, ప్రత్యేక పోలీసు బృందాలు నిరంతరం పర్యటిస్తూ శాంతి భద్రతలను పర్యవేక్షించినట్లు ఎన్నికల సందర్భంగా సీపీ తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద విధులు నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బందికి ఆయన భద్రతా పరమైన పలు సూచనలు చేశారు. వరంగల్ పార్లమెంట్ పరిధిలోని 7 నియోజకవర్గాలలో ఉదయం నుండి సాయంత్రం ఆరు గంటల వరకు పోలింగ్ నిర్వహించగా భూపాలపల్లి జిల్లా మావోయిస్టు ప్రభావిత ప్రాంతం కావడంతో ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం 4 గంటలకు ముగించారు. మండుతున్న ఎండల్లో సైతం ఓటు వేయడానికి ఓటర్లు ఉత్సాహాన్ని చూపించారు. మొత్తం వరంగల్ లోక్‌సభ వ్యాప్తంగా సాయంత్రం 5 గంటల వరకు సుమారు 64.08 శాతం వరకు ఓటింగ్ నమోదైనట్లు తెలిపారు. జిల్లాలోని పరకాల అసెంబ్లీ నియోజకవర్గంలో సాయంత్రం 5 గంటల వరకు 70.2 శాతం పోలింగ్ నమోదు కాగా వరంగల్ పశ్చిమలో కేవలం 47 శాతం మాత్రమే నమోదు అయింది.అలాగే వరంగల్ తూర్పులో 59.43 శాతం,స్టేషన్ ఘన్‌పూర్‌లో 74.64 శాతం, పాలకుర్తిలో 68.41 శాతంనర్సంపేటలో 73.01 శాతం, వర్ధన్నపేటలో 66.43,భూపాలపల్లిలో 65 శాతం శాతం ఓటు హక్కును వినియోగించుకున్నారు. గ్రామీణ ప్రాంత ఓటర్లు తమ ఓటు హక్కును ఉపయోగించకునేందుకు చూపిన ఉత్సాహం అర్బన్ ప్రాంతంలో చూపించలేకపోయారు. గతంలో మాదిరిగానే విద్యావంతులు అధికంగా ఉండే పట్టణ ప్రాంతాలలోనే ఓటర్లు తక్కువగా ఓటు హక్కును వినియోగించుకున్నారు. కాగా వరంగల్ ఎంపి అభ్యర్థులుగా పోటీ చేస్తున్న కాంగ్రెస్, బీజేపి అభ్యర్థులు కడియం కావ్య, ఆరూరి రమేష్ హన్మకొండలో తమ ఓటు హక్కు వినియోగించుకోగా,



తరువాయి 4లో

### ఓటు హక్కును వినియోగించుకున్న

## దుబ్బాక ఎంఎల్‌ఎ

**ప్రజాపక్షం/దుబ్బాక:** మెదక్ లోక్‌సభ ఎన్నికల స్థానానికి సోమవారం నిర్వహించిన ఎన్నికలు దుబ్బాక నియోజకవర్గంలో ఎన్నికలు ప్రశాంతంగా ముగిసినట్లు జిల్లా అదనపు కలెక్టర్ , నియోజకవర్గ ఎన్నికల అదనపు అధికారి గరిమా అగ్రవాల్ తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని 253 పోలింగ్ కేంద్రాల్లో ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 6వరకు ఓటింగ్ నిర్వహించారు. ఓట్లు వేసేందుకు ఆయా పోలింగ్ కేంద్రాల వద్ద మహిళలు, పురుషులు భారీగా తరలివచ్చారు. దుబ్బాక మండలం పోతారం గ్రామంలో దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి కుటుంబసభ్యులతో కలిసి ఓటు హక్కును వినియోగించుకున్నారు. అక్బర్‌పేటభూంపల్లి మండలం పరిధిలోని బొప్పాపూర్ గ్రామంలో మాజీ ఎమ్మెల్యే, బిజెపీ ఎంపి అభ్యర్థి మాధవనేని రఘునందన్‌రావు ఓటు హక్కును, తొగుట మండలం తుక్కాపూర్‌లో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జీ చెరుకు శ్రీనివాస్‌రెడ్డి ఓటు హక్కును వినియోగించుకున్నారు. దుబ్బాకలో పోలింగ్ కేంద్రాన్ని

తరువాయి 5లో



### భూపాలపల్లిలో

## 65 శాతం పోలింగ్



### గతంలో 62 శాతం, ప్రస్తుతం 65 శాతం
### 3 శాతం పెరిగిన పోలింగ్
### కలెక్టర్ భవేష్ మిశ్రా

**ప్రజాపక్షం / జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** రాష్ట్రంలో జరుగుతున్న ఎంపి ఎన్నికల లో భాగంగా వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గంలోని భూపాలపల్లి అసెంబ్లీ నియోజకవర్గంలో 65 శాతం పోలింగ్ నమోదు అయినట్లు జిల్లా కలెక్టర్,ఎన్నికల అధికారి భవేష్ మిశ్రా తెలిపారు.మావోయిస్టు ప్రభావిత ప్రాంతమైన భూపాలపల్లి నియోజకవర్గంలో 8 మండలాలలోతో పాటు భూపాలపల్లి జిల్లా కేంద్రంలో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగాయన్నారు. జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు. పోలింగ్ కేంద్రాలలో పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేశారు.భూపాలపల్లి నియోజ కవర్గంలో రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు ఎన్నికల పోలింగ్ ప్రక్రియ జరి గిందని ఆయన తెలిపారు. 2019లో పార్లమెంట్ ఎన్నికల్లో జిల్లాలో 62 శాతం పోలింగ్ నమోదు కాగా ఈ 2024 పార్లమెంట్ ఎన్నికల్లో 65 శాతం నమోదు అయినట్లు

తరువాయి 5లో

# జనగామ జిల్లాలో ఎన్నడు లేనంత భారీగా పోలింగ్



**ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి:** జనగామ జిల్లాలో ఎన్నడు లేనంత భారీగా పోలింగ్ జరిగింది. ముందు రోజు కురిసిన వర్షం కారణంగా ఓటింగ్ తగ్గుతుందని భావించగా ఓటర్లు తండోపతండాలుగా వచ్చి ఓటు వేశారు. కుటుంబ సమేతంగా వచ్చి ఓట్లు వేయడం, యువత ఆసక్తిగా పోలింగ్‌లో పాల్గొనడం కనిపించింది. ఉదయం 6 గంటలకే మాక్ పోలింగ్ ప్రారంభంగా కాగా 7 గంటల నుండి పోలింగ్ మొదలైంది. జనగామ జిల్లాలో ఉదయం 9 గంటల వరకు 10.24 శాతం పోలింగ్ జరిగింది. జనగామ నియోజకవర్గంలో 10.84 శాతం నమోదు కాగా స్టేషన్‌ఘనపూర్‌లో 13 శాతం, పాలకుర్తిలో 10.24 శాతం నమోదైంది. ఉదయం 11 గంటల వరకు 28.37 శాతం పోలింగ్ నమోదు కాగా జనగామ నియోజకవర్గంలో 27.50శాతం, స్టేషన్‌ఘనపూర్‌లో 30.40శాతం, పాలకుర్తిలో 27.20 శాతం నమోదైంది. మధ్యాహ్నం వేల ఓలింగ్ పెరిగింది. మద్యాహ్నం 1 గంటకు జిల్లా వ్యాప్తంగా 46.10 శాతం పోలింగ్ జరగగా జనగామ నియోజకవర్గంలో 45.03శాతం, స్టేషన్‌ఘనపూర్‌లో 47.35 శాతం, పాలకుర్తిలో 45.67 శాతం నమోదైంది. మద్యాహ్నం 3 గంటల వరకు అది కాస్తా 61.39శాతానికి పెరిగింది. జనగామ నియోజకవర్గంలో 60.04 శాతం, స్టేషన్‌ఘనపూర్‌లో 63.51 శాతం, పాలకుర్తిలో 60.22 శాతం నమోదైంది. సాయంత్రం 5 గంటల వరకు జిల్లా వ్యాప్తంగా 71.11 శాతం పోలింగ్ నమోదు కాగా జనగామ నియోజకవర్గంలో 70.25 శాతం, స్టేషన్‌ఘనపూర్‌లో 74.64 శాతం, పాలకుర్తిలో 68.41 శాతం పోలింగ్ జరిగింది. ఆరు గంటల వరకు పోలింగ్ జరగగా అప్పటికి ఓటర్లు పోలింగ్ కేంద్రాల్లో బారులుతీరి ఉన్నారు. జిల్లా వాప్తంగా 80శాతానికి పైగా పోలింగ్ జరిగినట్లు సమాచారం.

## ఓటు వేసిన వారికి ఉచిత థైరాయిడ్ పరీక్ష



**ప్రజాపక్షం/హన్మకొండ టౌన్ :** ప్రజలు తమ అమూల్యమైన ఓటు వేసిన వారికి ఉచిత థైరాయిడ్ పరీక్ష నిర్వహించడం జరుగుతుందని సిరి మెడికేర్ థైరోకేర్ ఫ్రాంచైస్ మేనేజర్ చెట్లపల్లి నరేందర్ తెలిపారు. లోక్‌సభ ఎన్నికలలో ఓటు వేసిన వారు తమ సిరా చుక్కను చూపించి ఈ అవకాశాన్ని సదివినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ ఉచిత పరీక్షనుహన్మకొండ బస్టాండ్ రోడ్‌లోని ఏసియన్ శ్రీదేవి మాల్ ఎదురుగా గల సిరి మెడికేర్ థైరోకేర్ నందు నిర్వహించబడుతుందని తెలిపారు. ఉదయం 8 గంటల నుండి మద్యాహ్నం 12 గంటల వరకు సోమవారం, మంగళవారం ఉచితంగా టిఎస్‌హెచ్ పరీక్ష చేయబడుతుందని తెలిపారు. ఈ అవకాశాన్ని థైరాయిడ్ అనుమానాలు ఉన్న వారు అందరూ సద్వినియోగం చేసుకోవాలని సిరి మెడికేర్ థైరోకేర్ ఫ్రాంచైస్ మేనేజర్ కోరారు. వివరాలకు 9849062827 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

## ప్రశాంతంగా ముగిసిన పోలింగ్



**ప్రజాపక్షం/మహాదేవపూర్:** మహాదేవపూర్ ఉమ్మడి మండలంలో పోలింగ్ సోమవారం ప్రశాంతంగా ముగిసింది.మహాదేవపూర్ మండలంలో 18 గ్రామపంచాయితీల్లోని 34 పోలింగ్ కేంద్రాలలో 24,936 ఓటర్లకు గాను 18,350 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.మండల వ్యాప్తంగా 73.59 శాతం పోలింగ్ నమోదైనట్లు తహసీల్దార్ ప్రహ్లాద్ రాథోడ్ తెలిపారు.పలిమెల మండలంలో ఏడు గ్రామపంచాయితీలోని 11 పోలింగ్ కేంద్రాలలో 5481 మంది ఓటర్లకు గాను 4325 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.దీంతో పలిమెల మండలంలో సాయంత్రం నాలుగు గంటల వరకు పోలింగ్ ముగిసే సమయానికి 78.9 శాతం పోలింగ్ జరనిగినట్లు తహసీల్దార్ వివరించారు. అంతరాష్ట్ర వంతెనల వద్ద గట్టి భద్రతా ఏర్పాట్లు చేసి ఎలాంటి అవంఛనీయ సంఘటనలు జరగకుండా నిఘా ఏర్పాట్లు చేసారు.

## మండలంలో ప్రశాంతంగా ముగిసిన పోలింగ్



**ప్రజాపక్షం/గోవిందరావుపేటః** మండలంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా పార్లమెంట్ ఎన్నికలు పోలింగ్ ముగిసిందని పస్రా ఎస్ఐ కమలాకర్ అన్నారు. ఎస్ఐ కమలాకర్ మాట్లాడుతూ మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాలు ముందస్తుగానే తమ ఆధీనంలో ఉంచుకున్నామని ముందస్తు చర్యల్లో భాగంగా పోలింగ్ కేంద్రాలకు తమ పారా మిలిటరీ బలగాలను పంపామని ములుగు జిల్లా మొత్తం మావోయిస్టు ప్రభావిత ప్రదేశం కనుక ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తగు పటిష్టమైన చర్యలు తీసుకున్నామని అన్నారు. సోమవారం జరిగిన పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ బూత్‌ల వద్దకు తిరుగుతూ తామే స్వయంగా అన్ని బూత్‌లను పరిక్షీంచుకుంటూ ఎప్పటికప్పుడు ఓటింగ్ నమోదును తెలుసుకుంటు తగు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటు మండలంలో ఓటింగ్‌ను ప్రశాంతంగా ముగించామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్‌శాఖ సిబ్బంది, ఆయా గ్రామ పంచాయతీల కార్యదర్శులు, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## మొదటిసారి ఓటేసిన యువతులు



**ప్రజాపక్షం/నెక్కొండః** మొదటిసారిగా ఓటు హక్కు రావడంతో ఎంతో ఉత్సాహంగా ఆనందంగా వరంగల్ జిల్లా నెక్కొండ మండల కేంద్రంలోని పోలింగ్ బూత్‌లో యువతులు మెరుగు వెన్నెల, పేరాల పావని, ఇరువురు యువతులు ఓటు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత రాజ్యాంగం ఎన్నికల సంఘం మాకు ఓటు హక్కు కల్పించిందని ఓటు వేయడం చాలా సంతోషంగా ఉందని భావి తరాలను ప్రభావితం చేసే వారికి రక్షణగా ఉండే వ్యక్తులను ఎంపిక చేసుకోవడం కోసం మేము ఓటు వేశామని మేము ఎన్ని ఆశలతో వేశామో గెలిచిన వ్యక్తులు కూడా మమ్మల్ని ఓటర్లందరిని, ప్రజలకు న్యాయం చేస్తారని ఆశిస్తున్నామని యువతులు అన్నారు.

## చామల కిరణ్‌కుమార్‌రెడ్డి గెలుపుఖాయం



**ప్రజాపక్షం/బచ్చన్నపేట:** లోక్‌సభ ఎన్నికల్లో భువనగిరి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ఖాయమని కాంగ్రెస్ పార్టీ మండల అద్యక్షుడు నూకల బాల్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. మండలంలో 26 గ్రామ పంచాయితీ పరిధిలో ఉన్న పోలింగ్ బూతులను సందర్శించి పోలింగ్ విధానాన్ని వారు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలు కాంగ్రెస్ వైపే ఉన్నారన్నారు. భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి భారీ మెజార్టీతో గెలుపొందడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పిట్టల నర్సింహులు, జిల్లెల్ల వీరారెడ్డి, ఎడ్ల మధుసూధన్ రెడ్డి, జిల్లెల్ల సుగుణాకర్ రెడ్డి, ఎడ్ల గాల్‌రెడ్డి, బందారం ధనుంజయ, బందారం రాజు, ఎడ్ల యాదవరెడ్డి, గంగరబోయిన మహేందర్, పిట్టల శ్యామ్, తదితరులు పాల్గొన్నారు.

## మండలంలో సజావుగా జరిగిన పార్లమెంట్ ఎన్నికలు



**ప్రజాపక్షం/వేలేరు :** వేలేరు మండలంలోని 14 గ్రామాలలో 23 ఎన్నికల బూతులు ఉండగా ఎస్సై హరిత శాంతి భద్రతల పర్యవేక్షణలో డిసిపి ఎంఎ బారి,ఎసిపి తిరుపతి ఎన్నికల పోలింగ్ సరళిని స్వయంగా పరిశీలించారని మండలంలో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరుగలేదని ఎస్సై హరిత తెలుపగా,తహశీల్దార్ హెచ్ కోమి వివరాల ప్రకారం వేలేరు మండలజనాభా 16254 మందికి 164 మంది వివిధకారణాలతో ఓటు హక్కును సద్వినియోగం చేసుకోలేదని 16090 మంది పార్లమెంట్ ఎన్నికల సమయం ముగిసేసరికి దాదాపుగా 75/ శాతం ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవడం జరిగిందని మండలతహశీల్దార్ హెచ్ కోమి తెలిపారు.కార్యక్రమంలో మాజీమంత్రి గుండె విజయరామారావు,జడ్‌పిటిసి చాడ సరిత,ఎంపిపి సమ్మిరెడ్డి,మాజీకుడాడైరెక్టర్ బిల్ల యాదగిరి తదితరులు ఓటుహక్కును వినియోగించుకోగా మాజిఉపముఖ్యమంత్రి డా,టి రాజయ్య మండలంలోని వివిధ గ్రామాలలో పోలింగ్ సరళిని పరిశీలించారు.

## బూర్గుపల్లిలో... ఓటు వేసిన ఎఫ్డిసి మాజీ చైర్మన్



**ప్రజాపక్షం/గజ్వేల్:** పార్లమెంటు ఎన్నికల్లో భాగంగా రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాపరెడ్డి తన సొంత గ్రామమైన బూర్గుపల్లిలో కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కును వినియోగించుకున్నారు. అలాగే తాజా మాజీ సర్పంచ్ వంటేరు విజయవర్ధన్ రెడ్డి అదే పోలింగ్ కేంద్రంలో ఓటు వేశారు.

## దామెరలో ఓటింగ్‌ను పరిశీలిస్తున్న మాజీ ఎంఎల్‌ఎ



**ప్రజాపక్షం/దామెర :** పార్లమెంటు ఎన్నికలు జరుగుతున్న సందర్భంగా సోమవారం దామెర మండల కేంద్రంలోని పోలింగ్ సెంటర్‌ను పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా చల్లా మాట్లాడుతూ.. ఓటు హక్కు ఉన్న ప్రతీ ఒక్క ఓటరు తమ ఓటును తప్పకుండా వినియోగించుకోవాలన్నారు.

## మండలములో ప్రశాంతంగా ముగిసిన ఎన్నికలు



**ప్రజాపక్షం/ధర్మసాగర్:** పార్లమెంట్ ఎన్నిల్లో భాగంగా సోమవారం ధర్మసాగర్ మండలములోని 17గ్రామల్లో పోలీస్ బందోబస్తు మధ్య వివిధ గ్రామల్లో యువతి యువకులు వివిధ రాజకీయ పార్టీల కార్యకర్తలు ఉత్సహంగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.ఇండియా కూటమి అభ్యర్థి కడియం కావ్య ధర్మసాగర్ మండలకేంద్రములోని పోలింగ్ సరళని పరిశీంచారు.మండలములో ఎలాంటి అవాంఛనీయ సంఘటలు జరుగకుండా పోలీస్‌లు చర్యలు తీసుకున్నారు.

## జఫర్‌గడ్‌లో పోలింగ్ కేంద్రాన్ని సందర్శించిన సిపి



**ప్రజాపక్షం/జఫర్‌గడ్:** జఫర్‌గడ్ మండల కేంద్రంలో పార్లమెంటరీ ఎన్నికలు నిర్వహిస్తున్న జిల్లా ప్రజాపరిషత్ హైస్కూల్‌లో ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రాలను వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా పోలింగ్ కేంద్రంలో మౌళిక సదుపాయాలపై పోలీస్ కమిషనర్ ఆరా తీయడం జరిగింది.

## ఓటుహక్కు వినియోగించుకున్న సిపిఐ జిల్లా కార్యదర్శి



**ప్రజాపక్షం/ములుగు జిల్లా ప్రతినిధిః** పార్లమెంట్ ఎన్నికలలో భాగంగా సిపిఐ ములుగు జిల్లా కార్యదర్శి తోట మల్లికార్జున రావు విఆర్‌కె పురం 44వ బూత్‌లో తన నోటు హక్కు వినియోగించుకున్నారు.

## ఓటు హక్కు వినియోగించుకున్న శతాధిక వృద్ధురాలు



**ప్రజాపక్షం/అల్లాదుర్గం:** రాష్ట్రంలో జరుగుతున్న పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా మెదక్ జిల్లా అల్లాదుర్గం మండలం వెంకట్రావు పేట గ్రామనికి చెందిన ముద్దపురం వీరమ్మ శతాధిక వృద్ధురాలు సోమవారం కుటుంబ సభ్యులతో కలసి వీల్ చైర్ సహాయంతో పోలింగ్ కేంద్రానికి తరలివచ్చి తన ఓటు హక్కును వినియోగించుకున్నారు.

## క్యూ లైన్‌లో నిలబడి ఓటు వేసిన రాష్ట్ర సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షులు



**ప్రజాపక్షం/మనోహరాబాద్:** తెలంగాణ రాష్ట్ర సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షులు,మనోహరాబాద్ మాజీ సర్పంచ్ చిట్కుల మహిపాల్ రెడ్డి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మండల కేంద్రమైన మనోహరాబాద్ పోలింగ్ కేంద్రంలో సోమవారం ఓటర్లతోపాటు క్యూలైన్లో నిలబడి ఓటు వేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేనొక్కడినే ఓటు వేయకుంటే ఏమవుతుందిలే అనుకోవద్దు ఒక్క ఓటే ప్రభుత్వాలను మారుస్తుందన్న విషయాన్ని మరచిపోవద్దు అని అన్నారు. ప్రజలందరూ తమ భవిష్యత్తు కొరకు మంచి నాయకున్ని ఎన్నుకొని తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఓటు వేసిన వారిలో కాంగ్రెస్ నాయకులు మాజీ ఎంపీటీసీ ర్యకాల కృష్ణ గౌడ్,ఇమాంపూర్ యాదగిరి గౌడ్, మండల మైనారిటీ అధ్యక్షులు, సొసైటీ డైరెక్టర్ జావిద్ పాషా, ర్యలక రమేష్ గౌడ్, యువకులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంత వాతావరణంలో ముగిసిన ఎన్నికలు




**ప్రజాపక్షం/మనోహరాబాద్:** సోమవారం జరిగిన పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ మనోహరాబాద్ మండలంలో ప్రశాంతంగా ముగిశాయి. మండల వ్యాప్తంగా 22 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయగా ఇందులో 15,403 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 7720 మంది పురుషులు,7683 మంది మహిళలు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మండల వ్యాప్తంగా 83.80 పోలింగ్ జరిగినట్లు తహసిల్దార్ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. పోలింగ్ కేంద్రాలలో ఎలాంటి సంఘటనలు జరగకుండా ఎస్సై కరుణాకర్ రెడ్డి ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

# ప్రశాంతంగా ముగిసిన పోలింగ్

### ఎన్నికల ప్రక్రియపై ఆర్ఓ, జిల్లా కలెక్టర్ ప్రావిణ్య పరిశీలన



**ప్రజాపక్షం/వరంగల్ ప్రతినిధి :** వరంగల్ పార్లమెంట్ పరిధిలో పోలింగ్ ప్రక్రియ సోమవారం ప్రశాంతంగా ముగిసింది. ఎన్నికల ప్రక్రియపై వరంగల్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ ప్రావిణ్యాల కంట్రోల్ రూమ్‌లో ఏర్పాటుచేసిన వెబ్‌కాస్టింగ్, లైవ్ స్ట్రీమింగ్ ద్వారా పర్యవేక్షించారు. పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించి అధికారులకు పలు సూచనలు చేశారు. పోలింగ్ కేంద్రాలలో ఏర్పాటు సక్రమంగా ఉండాలని, ఓటర్లు ఇబ్బందులు కలుగకుండా చూడాలని అన్నారు. దీనితోపాటు ఎప్పటికప్పుడు ఎన్నికల ప్రక్రియను వెబ్ కాస్టింగ్ ద్వారా మానిటరింగ్ చేస్తున్నారు. తన దృష్టికి వచ్చే అంశాలపై అధికారులు అప్రమత్తం చేశారు. సోమవారం ఉదయం ఏడుగంటలకు పోలింగ్ ప్రక్రియ ప్రారంభమైందని, ఉదయం 9గంటలకు వరకు 8.97 శాతం పోలింగ్ నమోదు అయింది. 11గంటలకు 24.48శాతం, మధ్యాహ్నం ఒంటిగంటకు 41.23 శాతం, మూడు గంటలకు 54.17శాతం పోలింగ్ నమోదు అయింది. ఐదుగంటలకు 64.08 శాతం నమోదు అయింది. ఆరుగంటలకు వరుకు శాతం నమోదయింది. ఓటు వేసేందుక ఓటర్లు పోలింగ్ కేంద్రాల వద్ద క్యూ కట్టారు. గంట గంటకు పోలింగ్ శాతం పెరుగుతూ వస్తున్నది. వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గం మొత్తంగా పోలింగ్ ప్రక్రియ సాఫీగా సాగుతున్నది.

## పాలకుర్తిలో ప్రశాంతంగా పోలింగ్...



**ప్రజాపక్షం/పాలకుర్తి:** నియోజకవర్గంలో పార్లమెంటు ఎన్నికలకు జరిగిన పోలింగ్ సోమవారం ప్రశాంతంగా ముగిసింది. నియోజకవర్గంలో మొత్తం 255514 మంది ఓటర్లుండగా నియోజకవర్గంలో 296 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటుచేశారు. పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి తొర్రూరు మండల కేంద్రంలో ఓటు హక్కును వినియోగించుకోగా, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు వరంగల్ జిల్లా పర్వతగిరిలో ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉదయం 7 గంటలకే పోలింగ్ ప్రారంభమైంది. మండలంలోని మంచుప్పుల గ్రామంలో అరగంట పాటు ఈవీఎం మొరాయించింది. నియోజకవర్గంలోని కొన్ని గ్రామాలలో పోలింగ్ కేంద్రాలలో దివ్యాంగులకు వీల్‌చైర్లు ఏర్పాటుచేసినప్పటికి మంచినీరు ఏర్పాటుచేయలేదు. పాలకుర్తి మండలంలోని పాలకుర్తి, దర్దేపల్లి గ్రామాలలో పోలింగ్ సరళిని ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, ఎర్రబెల్లి దయాకర్‌రావు వేర్వేరుగా సందర్శించి పరిశీలించారు. వరంగల్ కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్య పాలకుర్తి, తొర్రూరు గ్రామాలలో పోలింగ్ సరళిని పరిశీలించారు. నియోజకవర్గంలో ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా జరిగాయి.

## కుక్కల దాడిలో...48 గొర్రెలు మృతి



**ప్రజాపక్షం/గజ్వేల్:** వర్గల్ మండలంలోని అంబర్‌పేటలో గొర్రెల బండ సత్యనారాయణకు చెందిన 48 గొర్రెలు వీధి కుక్కల దాడిలో మృతి చెందాయి. రోజు వారి మాదిరిగానే గొర్రెల దొడ్డిలో జీవాలను తోలి ఇంటికి వెళ్ళగా, భోజనం చేసి పశువుల దొడ్డికి వెల్దామనుకునే క్రమంలో భారీ వర్షం రావడంతో సత్యనారాయణ ఇంటివద్దనే ఉండిపోయాడు. దీంతో సోమవారం ఉదయం జీవాల దొడ్డికి వెళ్లి చూడగా 48 గొర్రెలు విగత జీవులుగా పడి ఉండటంతో సత్యనారాయణ కంటతడి పెట్టాడు. ఈ విషయం తెలుసుకున్న జడ్పీటీసీ బాలు యాదవ్, పార్టీ నాయకులు వేలూరి కృష్ణా రెడ్డి సంఘటన స్థలానికి చేరుకొని బాధితుడిని పరామర్శించడంతో పాటు ఆర్థిక సహాయం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం బాధితుడికి నష్ట పరిహారం చెల్లించడమే కాకుండా, గతంలో గొర్రెలకోసం డబ్బులు చెల్లించిన వారందరికీ వెంటనే గొర్రెలను పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు.

## ఓటు హక్కు వినియోగించుకున్న పట్టణ ప్రముఖులు

**ప్రజాపక్షం/ సిద్దిపేట ప్రతినిధి :** పార్లమెంట్ ఎన్నికల్లో సిద్దిపేట నియోజక వర్గంలో పట్టణ ప్రముఖులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కొత్తగా వచ్చిన యవ ఓటర్లు సైతం పోలింగ్‌లో ఉత్సాహంగా పోలింగ్‌లో పాలుపంచుకున్నారు. సిద్దిపేట పట్టణంలో పోలింలగ్ మందకొడిగా ప్రారంభమైంది. 10 గంటల తర్వాత సాయంత్రం పోలింగ్ వేగంగాపుంజుకుంది. పట్టణంలోని పోలింగ్ బూత్‌లో పెద్దగా బారులు తీరనప్పటికి ఓటింగ్ క్రమ పద్ధతిలో కొనసాగింది. సిద్దిపేటలో పట్టణంలో మున్సిపల్ చైర్మన్ మంజుల రాజనర్సు భారత్‌నగర్ అంబిటాస్ కేంద్రంలో కుటుంబ సమేతంగా ఓటు హక్కును వినియోగించుకున్నారు. పట్టణంలోని న్యూ జనరేషన్ కళాశాలల్లో మాజీ ఎంఎల్‌సి ఫారుఖ్‌హుస్సేన్ కుటుంబ సమేతంగా ఓటు హక్కును వినియోగించుకున్నారు. బాలికల కళాశాలలో పోలింగ్ కేంద్రంలో





పిసిసి చేనేత విభాగం చైర్మన్ గూడూరి శ్రీనివాస్ కుటుంబ సమేతంగా ఓటు హక్కును వినియోగించుకున్నారు. అలాగే సిద్దిపేట నియోజక వర్గం ఇంచార్చి పూజల హరికృష్ణ, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు అత్తుఇమామ్ ఓటు హక్కును వినియోగించుకున్నారు. డిసిసి ఓబిసి సెల్ చైర్మన్ సూర్యవర్మ, ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర కోఆర్టీనేటర్ దాసరి రాజు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అలాగే బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు రాజనర్సు, మచ్చ వేణుగోపాల్‌రెడ్డి, మారెడ్డి రవీందర్‌రెడ్డి, గుండు భూపేశ్,పాల సాయిరాం, మున్సిపల్ వైస్ చైర్మన్ కనకరాజు, కౌన్సిలర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. బిఆర్ఎస్ మైనార్టీ క్రిస్టియన్ నాయకులు నెలమల్లి సికిందర్ కుటుంబ సమేతంగా ఓటు హక్కును వినియోగించుకున్నారు.

## టేకుమట్ల మండలం 73.75శాతం వినియోగించుకున్నా ఓటర్లు

**ప్రజాపక్షం/టేకుమట్లః** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్నా పార్లమెంట్ ఎన్నికల్లో మండలంలో 73.75 శాతం పోలింగ్ నమోదు అయినట్లు మండల తహసిల్దార్ విజయలక్ష్మి తెలిపారు. మండలంలో 21959 మంది ఓటర్లకు 16195 ఓట్లు పడినట్లు అందులో పురుషులు 8076, మహిళలు 8119 ఓటు హక్కును వినియోగించుకున్నారు.ఓటర్లందరూ ఉత్సహంగా ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ కేంద్రల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ప్రశాంత వాతవరణంలో ఎన్నికలు సజావుగా జరగాడానికి సహకరించిన పోలిస్ సిబ్బందికి ఎన్నికల రిటర్నింగ్ అధికారి కృతజ్ఞతలు తెలిపారు.

## ఓటు హక్కును వినియోగించుకున్న భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్నటువంటి పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి భూపాలపల్లి జిల్లా ప్రజా పరిషత్ హై స్కూల్ నందు తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మీరు వేసే ఓటు దేశ ప్రజల భావితరాల భవిష్యత్తు కోసమని గుర్తు పెట్టుకోవాలని, మీరు వేసే ఒక్క ఓటు దేశ భవిష్యత్తు నిర్ణయిస్తుందని కాబట్టి ఒకసారి ఆలోచించి మీ అమూల్యమైన ఓటును వినియోగించుకోవాలని కోరారు.

## బుద్దారం గ్రామంలో ఓటు హక్కు వినియోగించుకున్న ఎంఎల్ఎ గండ్ర



**ప్రజాపక్షం/గణపవరం:** భూపాలపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు వారి సతీమణి పద్మ (గణపురం జడ్పిటిసి)తో కలిసి గణపురం మండలంలోని వారి స్వగ్రామం బుద్దారం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో(బూత్ నంబర్ 216)లో ఉదయం ఓటు హక్కును వినియోగించుకున్నారు. ప్రజలంతా తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని సూచించారు. అంతకుముందు గ్రామంలోని శ్రీ పర్వత వర్ధిని సహిత రామలింగేశ్వర స్వామి దేవాలయంలో ఆలయ ప్రధాన అర్చకులు శేషాచార్యులు వారి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే గండ్ర సత్తన్న దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో వారి వెంట గణపురం మండల పరిషత్ వైస్ ఎంపిపి విడిదినేని అశోక్ తదితరులు ఉన్నారు.

## ఓట్లు వేసేందుకు ముందుకు వచ్చిన యువత



**ప్రజాపక్షం/గణపురం:** వరంగల్ పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ఎలాంటి అవంచనియ సంఘటనలు జరగకుండా ఎన్నికలు ఉదయం 7 గంటల నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు ముగిసాయి. మండలంలో 68 .86. శాతం ఓట్ల శాతం నమోదయింది. 32.995 ఓట్లు ఉండగా22.723 ఓట్లు పోలయ్యాయి. మండల కేంద్రంలో మాత్రం 86.68 శాతం నమోదయింది. పార్లమెంట్ ఎన్నికలకు యువకులు ఓట్లు వేసేందుకు భారీ సంఖ్యలో హాజరయ్యారు. ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి కొన్ని పోలింగ్ కేంద్రాలలో నీళ్లు నిలిచి బురదమయంగా మారాయి చెల్పూర్ పోలింగ్ కేంద్రంలో భారీగా నీళ్లు నిలిచాయి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్సై మచ్చ సాంబమూర్తి భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎన్నికలకు ప్రజలు ఉత్సాహంగా పాల్గొని తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

# కడియం కావ్య గెలుపు ఖాయం



**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** ఉదయం నుండి జరుగుతున్న పోలింగ్ ను పరిశీలిస్తే వరంగల్ పార్లమెంట్ అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీ నుండి పోటిచేసిన డాక్టర్ కడియం కావ్య లక్షాలాది మెజార్టీతో గెలవటం ఖాయమని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ధీమా వ్యక్తం చేశారు.సోమవారం లోక్ సభ ఎన్నికల పోలింగ్ జరుగుతున్న నేపద్యంలో జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రం లోని జిల్లా పరిషత్ హైస్కూల్ లో ఎమ్మెల్యే పోలింగ్ బూతులలో ఓటింగ్ సరలిని పరిశీలించారు.ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ..భూపాలపలి నియోజకవర్గంలో నాకు అసెంబ్లి ఎన్నికల్లో 50వేల మెజార్టీ ప్రజలు ఇచ్చారని అదే విధంగా దానికి తగ్గకుండా మెజార్టీ ప్రజలు ఇస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు.నియోజవర్గంలో ఓటింగ్ సరలి చూస్తే వన్ సైడిగా కాంగ్రెస్ పార్టీ హస్తం గుర్తుకే పడుతున్నట్లు తెలిపారు. దేశంలో ఇండియా కూటమి గెలవటం ఖాయమని దేశానికి స్వతంత్రం తెచ్చిన పార్టీగా అట్లాగే త్యాగాల కుటంబం నుండి వచ్చిన రాహూల్ గాంధీ ప్రధాని అవుతున్నాడాని అన్నారు. దేశంలో కాంగ్రెస్ పార్టీతో నే ప్రజా సంక్షేమం సాధ్యమని అన్నివర్గాల అభివృద్ది ఆశించే పార్టీ కాంగ్రెస్ అని, తప్పకుండా ప్రజల నమ్మకాన్ని వమ్ముచేయకుండా ఇచ్చిన హామీలను నెరవేరుస్తామని ఎమ్మెల్యే తెలిపారు.ఆయన వెంటా సిపిఐ జిల్లా కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్, కాంగ్రెస్ జిల్లా నాయకులు బుర్ర కొమురయ్య,అప్పం కిషన్,భూపాలపల్లి పట్టణ అధ్యక్షులు ఇస్లావత్ దేవన్ తదితరులు ఉన్నారు.

## హల్దీ వాగులో దూకి రైతు ఆత్మహత్య



**ప్రజాపక్షం/మనోహరాబాద్:** హల్దీ వాగులో దూకి రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన తూప్రాన్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే మనోహరాబాద్ మండలంలోని మేజర్ గ్రామపంచాయతీ కళ్ళకల్ గ్రామానికి చెందిన చీర్ల ఆగమయ్య (65) ఇటీవల తన భార్య చనిపోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటూ పెళ్లీడుకొచ్చిన కూతురి వివాహం చేయలేక పోతున్నానని మనస్థాపానికి గురై ఆదివారం ఉదయం ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తూప్రాన్ పట్టణ శివారులోని హల్దీ వాగులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలిసిన పోలీసులు మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## ఓటు ఒక హక్కే కాదు ఆయుధం కూడా



**ప్రజాపక్షం/టేక్మాల్:** టేక్మాల్ మండల పరిధిలోని సాలోజిపల్లి గ్రామంలో ప్రాథమిక పాఠశాలలో సాలోజిపల్లి మస్జిద్ ఈ ఖాద్రీయా కమీటీ సదర్ మహమ్మద్ శబొద్దీన్ తన కుటుంబంతో కలిసి ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ, మన దేశ రాజ్యాంగ పరిరక్షణ కోసం ప్రజలందరూ ఏకమై ప్రజాస్వామ్య విలువలను కాపాడే విధంగా ఓటర్ తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని సూచించారు.

## ప్రశాంతంగా పార్లమెంట్ ఎన్నికలు...



**ప్రజాపక్షం/బెజ్జంకి:** రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా సోమవారం మండలంలో ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి.ప్రజలు తమ ఓటు హక్కును స్వచ్ఛందంగా వినియోగించుకున్నారు.మండల వ్యాప్తంగా 28585 ఓటర్లు ఉండగా పురుషులు 13886,స్త్రీలు 14699 ఉన్నారు.పోలింగ్ సమయం ముగిసేసరికి మండల వ్యాప్తంగా పోలింగ్ శాతం 83% నమోదైనట్లు అధికారులు తెలిపారు.గుండారం గ్రామంలో బూతు నెం.315లో ఈవిఎం యంత్రం మొరాయించడంతో గంట ఆలస్యంగా ప్రారంభమైంది. రేగులపల్లి గ్రామంలోని మోడల్ పోలింగ్ కేంద్రాన్ని జిల్లా పంచాయితీ అధికారి దేవకి దేవి,ఎంపిడివో లక్ష్మప్పలు సందర్శించి ఎన్నికల ప్రక్రియను పరిశీలించారు.ఎన్నికల్లో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులు పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేశారు.

## క్యూలో నిలబడి ఓటు వేసిన కలెక్టర్



**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి:** ఓటర్లతో కలిసి క్యూలో నిలబడి తన ఓటు హక్కును జిల్లా కలెక్టర్ భవిష్ మిశ్రా వినియోగించుకున్నారు. లోక్ సభ సాధారణ ఎన్నికల పోలింగ్ సందర్భంగా జిల్లా కేంద్రం లోని మంజూర్ నగర్ పి.ఎస్ నెంబర్ 79లో సామాన్యుడిలా క్యూ లైన్ లో నిలబడి తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. సోమవారం జిల్లా ఎన్నికల అధికారి అధికారి వరంగల్ పార్లమెంట్ పరిధిలోని భూపాలపల్లి అసెంబ్లీ సెగ్మెంట్ లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో తన ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, లోక్ సభ సాధారణ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ సజావుగా జరుగుతున్నట్లు తెలిపారు. జిల్లా కేంద్రంలోని మంజూర్ నగర్ లో ఉన్న తన ఓటు హక్కును బాధ్యతగా వినియోగించుకోవడం జరిగిందని తెలిపారు. ఓటు హక్కు వినియోగానికి పోలింగ్ కేంద్రాలలో అవసరమైన అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేశామని, ఓటర్లుకు పంపిణీ చేసిన పోలింగ్ స్లిప్పులతో పాటు ఓటర్ ఐ.డి. కార్డు లేదా ప్రభుత్వం జారీ చేసిన 12 గుర్తింపు కార్డులలో ఏదైనా ఒక గుర్తింపు కార్డు తీసుకొని వెళ్లి తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆయన సూచించారు.

## పాపన్నపేట మండలంలో 80.63 శాతం ఓటింగ్

**ప్రజాపక్షం/పాపన్నపేట:** పన్నపేట మండలంలో లోకసభ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. మండల పరిధిలో 59 పోలింగ్ కేంద్రాలు 41,857 ఓటర్లు ఉన్నారు. వీరిలో 33,752 ఓట్లు నమోదయ్యాయి. సాయంత్రం వరకు 80.63 శాతం ఓట్లు పోలింగ్ జరిగింది. సోమవారం జరిగిన లోక్ సభ ఎన్నికల్లో ఉదయం నుండి మధ్యాహ్నం వరకు పోలింగ్ జోరుగా సాగింది. అనంతరం సాయంత్రం వరకు మందకోడిగా ఓట్లు పోల్ అయ్యాయి. మండల పరిధిలోని పోలింగ్ కేంద్రాలను మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు సందర్శించి ఓటింగ్ సరళిని అధికారులకు అడిగి తెలుసుకున్నారు. యూసుఫ్‌పేటలో మాజీ ఎమ్మెల్యే శశిధర్ రెడ్డి, మల్లంపేట లో ఎంపిపి చందన ప్రశాంత్ రెడ్డి, ఆర్కెల లో జెడ్పిటిసి షర్మిల శ్రీనివాస్ రెడ్డిలు ఓటు హక్కు వినియోగించుకున్నారు.

## పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ ప్రశాంతం...



**ప్రజాపక్షం/మద్దూరు/ధూల్మిట్ట :** లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా సిద్దిపేట జిల్లా జనగామ నియోజకవర్గంలోని ఉమ్మడి మద్దూరు,ధూల్మిట్ట మండల కేంద్రంలోని అన్ని పోలింగ్ కేంద్రంలో ఓటింగ్ ప్రశాంతంగా సాగిందని రిటర్నింగ్ ఆఫీసర్లు తెలియజేశారు. పలు గ్రామాల్లో చెదురు మదురు సంఘటనలు మినహా పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. కొండాపూర్‌లో 7 గంటల వరకు పోలింగ్ సాగింది. ధూల్మిట్ట మండల కేంద్రంలో 72.55 శాతం కాగ, ఉమ్మడి మద్దూరు మండల వ్యాప్తంగా 80 శాతం ఓటింగ్ జరిగింది. గెలుపుపై ఎవరి ధీమా వారు వ్యక్తం చేస్తున్నారు. అంతకు ముదు ఉమ్మడి మద్దూరు, ధూల్మిట మండలాల్లో ప్రాధాన పార్టీలు నాయకులు వేరువేరుగా పలు పోలింగ్ కేంద్రాలలో ఓటింగ్ సరళిని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఓటు భారత రాజ్యాంగం పౌరులకు ఇచ్చిన అతి ముఖ్యమైన హక్కు అని, ఎలాంటి ప్రలోభాలకు ఆశపడి ఓటును దుర్వినియోగం చేసుకోరాదని అన్నారు.

## ప్రశాంతంగా పోలింగ్... 82 శాతం పోలింగ్ నమోదు...



**ప్రజాపక్షం/రామాయంపేట:** సాదారణ ఎన్నికలు రామాయంపేట మండలంలో సోమవారం ప్రశాంతంగా ముగిసాయి. మండల వ్యాప్తంగా 82శాతం పోలింగ్ నమోదైనట్లు ప్రిసైడింగ్ అధికారి రజినికుమారి తెలిపారు. బీజేపీ, కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీల నాయకులు తమ పార్టీ అభ్యర్థి విజయం సాదిస్తారని దీమా వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని కోనాపూర్ గ్రామంలో మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి దంపతులు తమ కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కు వినియోగించుకున్నారు. పట్టణంలోని జూనియర్ కళాశాలలో పోలింగ్ కేంద్రాన్ని జనరల్ అబ్జర్వర్ సమీర్ మాదవ్ కుర్‌కోటి పర్యవేక్షించారు. జబర్దస్త్ ఫేం అధిరే అభి తన ఓటు హక్కును దళితవాడలో గల ప్రభుత్వ పాఠశాలలో వినియోగించుకున్నారు. ప్రతి ఒక్కరు తమ సామాజిక బాద్యతగా బావించి ఓటు వేయాలని కోరారు. నూతనంగా ఓటు హక్కు వచ్చిన యువతి, యువకులు ఓటు వేసి తమ సంతోషాన్ని వెలిబుచ్చారు. కాట్రియాల గ్రామంలో నడవలేని స్థితిలో ఉన్న వృద్ధురాలిని కానిస్టేబుల్ సాయిబాబా సహాయంతో వీల్‌చైర్‌లో వచ్చి ఓటు వేశారు. ఉదయం నుండి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ ప్రశాంతంగా ముగియడంతో పోలీసులు, ఎన్నికల అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

**హరిజనవాడ వాడుకపై అభ్యంతరం...?**

రామాయంపేట పట్టణంలోని పోలింగ్ కేంద్రం 74ను సఖి పోలింగ్ కేంద్రంగా తీర్చిదిద్దారు. మండల పరిషత్ స్కూల్ దళితవాడ, ఎస్సీ కాలనీ అనకుండా అధికారులు హరిజనవాడ అనడంపై కొంతమంది అభ్యంతరం వ్యక్తం చేశారు. హరిజన పదం వాడుకలో తొలగించిన విషయం అధికారులకు తెలియకపోవడం శోచనీయం అన్నారు. ఎన్నికల అధికారులు ఈ విషయమై స్పందించి చర్యలు చేపట్టాలని పలువును కోరుతున్నారు.

## జిల్లాలో ప్రశాంతంగా ముగిసిన ఎన్నికలు

(మొదటిపేజీ తరువాయి)

బీఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ మారపల్లి సుధీర్ కుమార్ జిల్లాలోని ముల్కనూరులో తన ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్య మాట్లాడుతూ పోలింగ్ సరళి బాగుందని, కాంగ్రెస్ పట్ల ప్రజలు అభిమానంతో ఆశీర్వదిస్తున్నారని, అత్యధిక మెజార్టీతో తాను గెలవబోతున్నాని, రాహుల్ గాంధీ దేశానికి ప్రధానమంత్రి కాబోతున్నారని ఆశాభావం వ్యక్తం చేశారు. పార్లమెంటు నియోజకవర్గంలో కార్యకర్తలు, నాయకులు అద్భుతంగా పని చేస్తున్నారని వారి పనితీరుకు ఈ ఎన్నికే నిదర్శనమని అన్నారు.

## సిద్దిపేటలో పోలింగ్ సరళీని పరిశీలించిన బిజెపి అభ్యర్థి రఘునందన్‌రావు

**ప్రజాపక్షం/ సిద్దిపేట ప్రతినిధి :** బిజెపి పార్లమెంట్ అభ్యర్థి రఘునందన్‌రావు సోమవారం సిద్దిపేట నియోజక వర్గంలోని వివిధ పోలింగ్ కేంద్రాలను సందర్శించి, పోలింగ్ సరళీని పరిశీలించారు. ఈసందర్భంగా సిద్దిపేట భారత్‌నగర్ అంబిటాస్ పాఠశాల వద్ద బిజెపి అభ్యర్థి రఘునందన్‌రావు మాట్లాడుతూ మెదక్ పార్లమెంట్ పరిధిలో పోలింగ్ బిజెపికి అనుకూలంగా ఉందన్నారు. మెదక్ పార్లమెంట్ పరిధిలో అన్ని నియోజక వర్గాల్లో పోలింగ్ ప్రశాంతంగా జరిగిందన్నారు. మేధావులు, విద్యావంతులు పోలింగ్‌లో చురుకుగా పాలుపంచుకోవాలన్నారు.



## ఓటు హక్కు వినియోగించుకున్న మాజీ ఎంఎల్ఎ



**ప్రజాపక్షం/కౌడిపల్లి :** పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా సోమవారం నర్సాపూర్ తాజా మాజీ ఎమ్మెల్యే చిలుముల మదన్ రెడ్డి సతీమణి సుజాత తో కలిసి తన స్వగ్రామమైన కౌడిపల్లిలో ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి మనిషికి ఓటు వజ్ర ఆయుధమని ప్రతి ఓటరు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆయన ఓటర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపిటిసి కాలేరు మంజుల శివాంజనేయులు, మాజీ ఎంపీపీ చిలుముల పద్మ నరసింహారెడ్డి, పిఎసిఎస్ సొసైటీ వైస్ చైర్మన్ చిలుముల చిన్నంరెడ్డి, జిల్లా యూత్ నాయకులు చంద్రం కృష్ణ గౌడ్ జిల్లా ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి కౌడ శ్రీనివాస్ గుప్తా, కౌడిపల్లి మండల శాఖ అధ్యక్షులు మటూరి శకయ్య, కౌడిపల్లి మాజీ ఉపసర్పంచ్ చంద్రం శ్రీనివాస్ గౌడ్, యవకులు, తిరుమలేష్, వెంకటేశ్వరరావు, మోతిలాల్, మక్బూల్, రాములు, లక్ష్మణ్, పాల్గొన్నారు.

# ఎన్నికలకు 2124 పోలింగ్ కేంద్రాల ఏర్పాటు

## మెదక్ స్థానానికి పోలింగ్ 72.34 శాతం నమోదు



**ప్రజాపక్షం/మెదక్ ప్రతినిధి:** సాధారణ లోకసభ 2024 ఎన్నికల నేపథ్యంలో మెదక్ పార్లమెంట్ (6) సెగ్మెంట్ కు సోమవారం జరిగిన ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగాయి. ఉమ్మడి మెదక్ జిల్లాలో అక్కడక్కడా స్వల్ప ఘర్షణలు మినహా పోలింగ్ శాంతియుత వాతావరణంలో ముగిశాయి. మెదక్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని మెదక్, నర్సాపూర్, సిద్దిపేట, దుబ్బాక, గజ్వేల్, సంగారెడ్డి, పటాన్ చేరువు నియోజవర్గాల్లో ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ కొనసాగింది. ఉదయం కొంచం మంద కొడిగా సాగిన పోలింగ్ సరళి మధ్యాహ్నం వరకు ఊపందుకుంది. మెదక్ పార్లమెంట్ స్థానానికి 72.34 శాతం పోలింగ్ నమోదు నమోదైంది.ప్రతి రెండు గంటలకు ఒకసారి పోలింగ్ సరళిని అధికారులు విడుదల చేశారు. మెదక్ 76.82, నర్సాపూర్ 81.15, సంగారెడ్డి 68.48, పటాన్ చెరువు 58.94, సిద్దిపేట 73.15, గజ్వేల్ 79.70, దుబ్బాక 78.69 శాతం ఓట్లు పోలయ్యాయి. మెదక్ లోకసభకు అత్యధికంగా నర్సాపూర్ 81.15 శాతం పోలింగ్ నమోదైంది. అత్యల్పంగా పటాన్ చెరువు లో 58.94శాతం ఓటింగ్ నమోదైంది. మెదక్ పార్లమెంట్ సెగ్మెంట్ లో 1828210 లక్షల మంది ఓటర్లు ఉండగా, 2124 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ ఎన్నికల్లో 44 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో నిలిచారు. మెదక్ నియోజకవర్గంలో 218735 మంది ఓటర్లు ఉండగా, 277 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. నర్సాపూర్ నియోజకవర్గంలో 22708 ఓటర్లు ఉండగా, 307 పోలింగ్ కేంద్రాలు, సిద్దిపేట సెగ్మెంట్ లో 237591 ఓటర్లు ఉండగా 273 పోలింగ్ కేంద్రాలు, దుబ్బాక నియోజకవర్గ పరిధిలో 200125 మంది ఓటర్లకు 253 పోలింగ్ కేంద్రాలు, గజ్వేల్ లో 280913 మంది ఓటర్లు ఉండగా 321 పోలింగ్ కేంద్రాలు, సంగారెడ్డి నియోజకవర్గంలో 249775 ఓటర్లు ఉన్నారు.వారికి 281 పోలింగ్ కేంద్రాలను, పటాన్ చెరువు సెగ్మెంట్ లో 413983 మంది ఓటర్లు ఉండగా 391 పోలింగ్ కేంద్రాలను ఎన్నికల సంఘం ఏర్పాటు చేసింది. పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు కట్టుదిట్టమైన భద్రత చర్యలు తీసుకున్నారు. అంగన్ వాడీలు, ఆశా వర్కర్లు, బీఎల్వోలు, ప్రిసైడింగ్ అధికారులు, ఇతర సిబ్బంది తమ సేవలను నిర్వహించారు. మెదక్ ఎంపీ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నీలం మధు దంపతులు పటాన్ చెరువు నియోజకవర్గ పరిధిలోని చిట్కుల్ గ్రామంలో ఓటు వేశారు. మెదక్ జిల్లా చిన్నశంకరంపేట మండలం కోర్విపల్లిలో మెదక్ ఎంఎల్ఏ రోహిత్ ఆయన సతీమణి శివాని రెడ్డి, రామాయంపేట మండలం కొనపూర్ లో మాజీ ఎంఎల్ఏ పద్మా దేవేందర్ రెడ్డి, కుటుంబ సభ్యులు, తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. జిల్లాలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేసినట్లు మెదక్ జిల్లా డా॥ బాలస్వామి తెలిపారు. జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేశామని ఎస్పీ స్పష్టం చేశారు.

## 45 మంది అభ్యర్థుల బరిలో ఉండడం వల్ల ఓటర్లు కన్ఫ్యూజ్

(మొదటిపేజీ తరువాయి)

స్వతంత్ర అభ్యర్థులు ఉండడంతో తిక మఖపడ్డారు. ఓటు వేయడానికి వృద్ధులు, మహిళలు చదువుకోలేని వారు చాలా సమయం తీసుకుని ఆలోచన చేశారు. అక్కడ ఉన్న అధికారులు నమోనా వి.వి ప్యాట్లతో ఓటు ఎలా వేయాలో చూపించినప్పటికీ ఏదో ఒక బటన్ నొక్కి ఓటు వేశామని ఓటర్లు మీడియా ముందు వాపోయారు. ఈ విధమైన ఓటింగ్ జరగడంతో ఆయా గ్రామాలలో మెజార్టీ వస్తాయనుకున్న పార్టీల రిజాల్ట్ తారుమారు అయ్యే అవకాశం ఉన్నట్లు నాయకులు అంచనా వేస్తున్నారు. 45 మంది అభ్యర్థుల జాబితాతో ఉన్న నమూనా వి.వి.ప్యాడ్లతో ఓటర్లకు అవగాహన కల్పిస్తే బాగుండేదని ఓటర్లు అభిప్రాయపడ్డారు.

## భూపాలపల్లిలో 65 శాతం పోలింగ్

(మొదటిపేజీ తరువాయి)

తెలిపారు. గతం కంటే మూడు శాతం ఓటింగ్ పెరిగినట్లు తెలిపారు. ఎంపి ఎన్నికల నిర్వహణలో భాగంగా పోలింగ్ ప్రక్రియలో సక్రమంగా సజావుగా నిర్వహించడంలో జిల్లా యంత్రాంగానికి సహకరించిన ఓటర్లకు భాగాస్వాములైన అధికారి యంత్రాంగాన్ని కలెక్టర్ అభినందించారు. ఎన్నికలకు సహకరించి ఎప్పటికపుడు ప్రచార మాద్యమాలతో ప్రజలకు చేరవేసిన మిడియా ప్రతినిధులను అభినందించారు.

**భారీ భద్రత నడుమ స్ట్రాంగ్ రూమ్‌లకు చేరుకున్న ఈవిఎంలు :**

భూపాలపల్లి నియోజకవర్గం పరిధిలో ప్రశాంతంగా ఎంపి ఎన్నికల పోలింగ్ ముగిసింది.భారీ భద్రత నడుమ జిల్లా ఎస్పీ పర్యవేక్షణలో స్ట్రాంగ్ రూంలకు ఈవిఎంలను తరలించారు.25 ప్రత్యేక కౌంటర్ల కు సెక్టార్ అధికారులను నియమించారు.సెక్టార్ అధికారులు పరిశీలించిన తదుపరి పోలింగ్ మెటీరియల్ సామాగ్రిని తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు.

## ఓటు హక్కును వినియోగించుకున్న దుబ్బాక ఎంఎల్ఏ

(మొదటిపేజీ తరువాయి)

సిద్దిపేట సీపీ అనురాధ , అదనపు డిసిపీ మల్లారెడ్డిలు పరిశీలించారు. దుబ్బాక సీఐ శ్రీనివాస్, ఎస్సై గంగరాజు ఆధ్వర్యంలో పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తు నిర్వహించారు. నియోజకవర్గం వ్యాప్తంగా సాయంత్రం ఐదు గంటల వరకు 78.69 శాతం నమోదైంది. దుబ్బాకలో మున్సిపల్ చైర్ పర్సన్ గన్నె భూంరెడ్డి, పోతారంలో దుబ్బాక ఎంపీపీ కొత్త పుష్పలత కిషన్‌రెడ్డిలు ఓటు హక్కును వినియోగించకున్నారు.

### పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన

## పార్లమెంట్ అభ్యర్థి బలరాంనాయక్



**ప్రజాపక్షం/నర్సంపేట :** మహబూబాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బలరాంనాయక్ నర్సంపేట నియోజకవర్గంలోని నర్సంపేట పట్టణం, నర్సంపేట మండలంలోని ఇటుకాలపల్లి, ముత్తోజిపేట, ఖానాపురం మండలంలోని బుధరావుపేట, మంగళవారీపేటలోని పోలింగ్ కేంద్రాలను సోమవారం పరిశీలించారు. పోలింగ్ సరళీ అద్భుతంగా కొనసాగుతోందని, కాంగ్రెస్ పార్టీ పట్ల ప్రజలు అభిమానంతో ఆశీర్వదిస్తున్నారని, అత్యధిక మెజార్టీతో తాను గెలువబోతున్నానని, రాహుల్‌గాంధీ దేశానికి ప్రధాని కాబోతున్నారని ఆశాభావం వ్యక్తం చేశారు. పార్లమెంట్ నియోజకవర్గంలోని కార్యకర్తలు నాయకులు అద్భుతంగా పనిచేస్తున్నారని వారి పనితీరుకు ఈ ఎన్నికే నిదర్శనమన్నారు. ఈకార్యక్రమంలో వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి తక్కళ్లపల్లి రవీందర్‌రావు, మున్సిపాలిటి ఫ్లోర్ లీడర్ వేముల సాంబయ్యగౌడ్, ఓబీసి సెల్ జిల్లా అధ్యక్షుడు ఓర్సు తిరుపతి, నర్సంపేట మండల పార్టీ అధ్యక్షుడు బానోత్ లక్ష్మణ్, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు అఖిల్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా ముగిసిన పోలింగ్



**ప్రజాపక్షం/నర్సంపేట :** మహబూబాబాద్ పార్లమెంట్ పరిధిలో నర్సంపేట రెవెన్యూ డివిజన్ పరిధిలోని పోలింగ్ ప్రక్రియ సోమవారం ప్రశాంతంగా ముగిసింది. పలు పోలింగ్ కేంద్రాలను అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి కృష్ణవేణి సందర్శించి పలు సూచనలు చేశారు. పోలింగ్ కేంద్రాలలో ఏర్పాటు సక్రమంగా ఉండాలని, ఓటర్లు ఇబ్బందులు కలుగకుండా చూడాలని అన్నారు. సోమవారం ఉదయం ఏడుగంటలకు పోలింగ్ ప్రక్రియ ప్రారంభమైందని, ఉదయం 9గంటలకు వరకు 11.57 శాతం పోలింగ్ నమోదు అయింది. 11గంటలకు 28.5శాతం, మధ్యాహ్నం ఒంటిగంటకు 43.6 శాతం, మూడు గంటలకు 62.3 శాతం పోలింగ్ నమోదు అయింది. ఐదుగంటలకు 73.01 శాతం నమోదు అయింది. ఆరుగంటలకు వరుకు శాతం నమోదయింది. ఓటు వేసేందుక ఓటర్లు పోలింగ్ కేంద్రాల వద్ద క్యూ కట్టారు. గంట గంటకు పోలింగ్ శాతం పెరుగుతూ వచ్చింది.

## పోలింగ్ కేంద్రాలలో వైద్య సేవలు




**ప్రజాపక్షం/ములుగు జిల్లా ప్రతినిధిః** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వైద్యారోగ్యశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ, ములుగు జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం ములుగు జిల్లాలో లోక్‌సభ ఎన్నికల దృష్ట్యా, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి ఉచిత ప్రథమ చికత్స కేంద్రాలను జిల్లాలోని ప్రతి పోలింగ్ కేంద్రంలో ఏర్పాటు చేయాలని ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలో గల మొత్తం 366 పోలింగ్‌స్టేషన్‌లో నిర్వహిస్తున్న ప్రథమ చికిత్స కేంద్రాలను పర్యవేక్షించేందుకు ఆరు బృందాలను జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ అప్పయ్య ఏర్పాటు చేశారు. ఈ కోణంలో ఆరు బృందాలు 12 మంది సూపర్‌వైజర్లు రాండమ్‌గా 176 పోలింగ్ కేంద్రాలను తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ప్రథమ చికిత్స కేంద్రంలో నిర్వహిస్తున్న ఓపి రిజిస్టర్‌ను, ప్రథమ చికిత్స కేంద్రంలో ఉపయోగిస్తున్న మందులు తనిఖీ చేశారు. ఏవైనా ప్రత్యేక పరిస్థిలులు ఏర్పడినట్లయితే వాటిని ఎదుర్కొనేందుకు 108 వాహనాలను ప్రతి మండలంలోని జడ్పిఎస్ఎస్ హైస్కూల్‌లో నిర్వహిస్తున్న పోలింగ్ స్టేషన్లలో సిద్ధంగా ఉంచడం జరిగిందని డాక్టర్ అప్పయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో పర్యవేక్షణ సిబ్బంది కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు దుర్గారావు, సంపత్‌రావు, సదానందం, తిరుపతయ్య, డెమో భాస్కర్, హెల్త్ ఎడ్యూకేటర్, వెంకట్ రెడ్డి, నరసింగరావు, దుర్గారావు, సబ్ యూనిట్ ఆఫీసర్ కోటిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ఓటు హక్కు వినియోగించుకున్న సిపిఐ జిల్లా కార్యదర్శి



**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిది:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి, సిపిఐ జిల్లా కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్, కొరిమి సుగుణ భూపాలపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అట్లాగే ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి మోట పలుకుల రమేష్ జిల్లా ప్రజా పరిషత్ భూపాలపల్లి హైస్కూల్లో తన ఓటు హక్కు వినియోగించుకున్నారు. అట్లాగే ఏఐటీయూసీ నాయకులు గురుజేపల్లి సుధాకర్ రెడ్డి, ఏం విజేందర్ ఆసిఫ్ పాషా, తాళ్ల పోశం, శంకర్ వివిధ పోలింగ్ కేంద్రాలలో ఓటు హక్కు వినియోగించుకున్నారు.

## పచ్చని పోలింగ్ బూత్...విన్నూత ప్రయత్నానికి ఓటర్లు ఫిదా..!



**ప్రజాపక్షం/దుబ్బాక:** ఎన్నికల వేళ... ఎండలో నిలబడి ఓటు వేయాలంటే ఎంతో ఇబ్బంది పడుతుంటారు. ఆహ్లాదకర వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఎన్నికల అధికారులు చేసిన విన్నూత ఆలోచన ఆకర్షిస్తోంది. సిద్దిపేట జిల్లా అక్బర్ పేటభూంపల్లి తహసీల్దార్ జింక జయంత్ ఆధ్వర్యంలో నోడల్ అధికారి బాస్కర్ తో కలిసి అక్బర్‌పేట భూంపల్లి మండల పరిధిలోని మోతె గ్రామంలో పచ్చని తోరణాలతో గ్రీన్ పోలింగ్ బూత్ ఏర్పాటు చేశారు. కొబ్బరి వెదురు, ఆరటి ఆకులతో పందిరి వేసి పోలింగ్ బూత్‌లో పండగ వాతావరణం కల్పించారు. పచ్చని తోరణాలు ఓటర్లకు స్వాగతం పలుకుతున్నాయి. ఎలాంటి ఇబ్బంది లేకుండా ఓటర్ల, వృద్ధులు సైతం ఓటు హక్కును వినియోగించుకున్నారు. గ్రీన్ పోలింగ్ బూత్ ఏర్పాటు చేసిన అధికారులను పలువురు గ్రామస్తులు అభినందించారు.